# తెరచాటు మనసులు

భుజానికో ఖద్దరు సంచీ వ్రేలాడదీసుకొని, పట్టపగలు మిట్ట మధ్యాహ్నం సాని వాడలో మొదటిసారిగా అడుగుబెట్టాడు సుబ్బారావు! పెంకుటిళ్ళ వసారా అరుగుల మీద కూర్చుని, నీళ్ళ పళ్ళాలలో వున్న మల్లె మొగ్గల్ని రాత్రి రాబోయే విటుల కోసం దండలు కడుతున్న సాని యువతులు, రోడ్డు మీద పోతున్న కొత్త ముఖాన్ని చూసి కిలకిలా నవ్వారు. సుబ్బారావు హఠాత్తుగా ఓ అరుగు దగ్గరగా నిల్చున్నాడు. అరుగు మీద యువతులు 'ఇదేదో పగటి బేరంలా వుంద'నుకొంటూ ఆశగా చూసి, కవ్వింపుగా నవ్వారు.

సుబ్బారావు గొంతు సవరించుకొని, "ధనలక్ష్మిగారిల్లేదో చెబ్తారా?" అని అడిగాడు.

"అది పెద్ద వీధిలో ఓ లాయరుగారికి పెర్మనెంటుగా కొలువుకి కుదిరింది. ఆ తలుపులు నీకు తెరుచుకోవు! ఈ అరుగెక్కు" అందో యువతి కొంటెగా.

"దయచేసి ఆ ఇల్లేదో చెబ్తే, నా పాట్లు నేను పడ్తాను?" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

"కొంచెం ముందుకుపోతే, రోడ్డుకు ఎడమ పక్కగా గులాబీ రంగు వెల్ల వేసిన డాబా కనిపిస్తుంది. అదే ఇల్లు" అందా యువతి. పదిహేడు పద్దెనిమిది వయసు దాటని ఆ యువతుల్ని జాలిగా చూస్తూ సుబ్బారావు ముందుకు కదిలాడు.

"వయసులో ఉన్న ఈ కుర్ర సన్నాసిక్కూడా ఆ ముదనష్టపు నడివయసు మనిషే కావల్సి వచ్చింది!" అంటూ సన్నగా మూలిగింది మరో యువతి.

సుబ్బారావుకా మాటలు వినిపించకపోలేదు.

సుబ్బారావు డాబా ఇల్లు గేటు తీసి, లోపలి మెట్లెక్కి తలుపు తట్టాడు. తలుపు తీసిన స్త్రీని చూసి ఒక్క క్షణం స్తంభించిపోయాడు. చూడ్డానికి నల్లగా ఉన్నా, అవయవ పుష్టితో, కళ్ళలోని ఆకర్షణతో మనిషిని నిలబెట్టే అందం ఆమెది. తేరుకొని అడిగాడు.

"ధనలక్ష్మిగారంటే మీరేననుకొంటాను?"

"అవును. కాని నేనిప్పుడు జనానికందుబాటులో లేను!" ధనలక్ష్మి చిన్నగా నవ్వుతూ, మందలింపుగా అంది.

"తెలుసు. అయినా రాక తప్పలేదు! నన్నిలా గుమ్మంలో నిలబెట్టి మాట్లాడడం మీకు భావ్యం కాదు"

"సరే, లోపలికి రా!" అంది ధనలక్ష్మి పక్కగా తప్పుకొంటూ. సుబ్బారావు ముందు గదిలో అడుగుపెట్టాడు. కుర్చీలో కూర్చోమని చెప్పి, లోపలికి వెళ్లి ఓ గ్లాసులో చల్లని నీళ్ళు తెచ్చి సుబ్బారావుకిచ్చి, ఎదురుగా వున్న ఉయ్యాల బల్ల మీద కూర్చుంది ధనలక్ష్మి.

"అందుబాటంటే వెల గురించి, ధర గురించీ కాదు! వెలయాలు ఊరందరికీ సొత్తయితే, ఉంచుకోబడ్డ ఆడది ఒక్కరికే సొత్తు! నేను ప్రస్తుతం ఒకరి ప్రాపకంలో ఉన్నాను. అందుకని కుదరదు" అంది ధనలక్ష్మి.

"ఆ సంగతీ తెలుసు!" అన్నాడు సుబ్బారావు.

"తెలిసి మరీ రావడమెందుకు? మాకూ కట్టుబాట్లూ, నీతి నియమాలూ వుంటాయి!"

"నా పేరు సుబ్బారావు. మిమ్మల్ని ప్రాపకంలో వుంచుకొన్న రాజారావు మా నాన్నగారు!"

"అయితే...?!" అర్థం కాక, విస్తుపోతూ అడిగింది ధనలక్ష్మి.

"మా అమ్మ చాలా మంచిది. ఆమె మనసు బాధపడడం నా కిష్టం లేదు" సుబ్బారావు సమాధానంగా అన్నాడు.

ధనలక్ష్మికి విషయం అర్థమైంది.

"నన్నుంచుకొన్నట్లు నీకెవరు చెప్పారు? ఈ రాయబారానికి పంపింది మీ అమ్మగారా?"

"కాదు. మా అమ్మ పెదవి విప్పలేదు! నేను రాజారావుగారబ్బాయిననీ, నా పేరు సుబ్బారావని మీకిప్పుడు తెలిసింది కాబట్టి, నా గురించిన వివరాలు మీకు తెలిసే ఉండాలి"

"నువ్వు మీ నాన్నగారికి మూడో సంతానానివి. బెంగుళూరులో అదేదో పెద్ద కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నావు"

"అవును. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం దొరికి, బెంగుళూరు వెళ్ళి ఏడాదయింది. మొదటి సెలవు పెట్టి ఇంటికి వచ్చి రెండు రోజులయింది. వచ్చిన రోజు రాత్రి భోజనం చేసి, కిళ్ళీ వేసుకొందామని వీరన్న కిళ్ళీ కొట్టుకు వెళ్ళాను. చిన్నప్పట్నుంచీ మేమన్నా, మా కుటుంబమన్నా అతనికి చాలా అభిమానం. అతనే విషయం చెప్పి బాధ పడ్డాడు. మీ దగ్గరకొచ్చి మాట్లాడే ధైర్యం పుంజుకోడానికి రెండు రోజులు పట్టింది!"

"మీ నాన్నగార్ని ఎందుకు చేశారని కాని, మీ అమ్మగార్ని ఏం బాధపడ్తున్నారని కాని అడిగి తెలిసికొనే ధైర్యం తెచ్చుకొని ఉంటే ఇంకా బావుండేదేమో?"

"ఇది చాలా సున్నితమైన విషయం! నిజంగా నాకు వారితో ఈ ప్రస్తావన ఎలా తీసుకురావాలో తెలియలేదు. అందుకనే మీ దగ్గర కొచ్చాను"

"భేష్! మీ గడప దోషం ఈ గడప లోపల తుడవడానికి ప్రయత్నిస్తున్నావు. అయితే

నేనిందులో చేయగలిగిందేమీ లేదు"

"ఉంది!" అంటూ సుబ్బారావు కుర్చీకి వేలాడదీసిన సంచీలోంచి అయిదు వేలు తీసి ఎందురుగా వున్న బల్ల మీద పెట్టాడు- "అవి అయిదు వేలు".

"ఆ డబ్బు తీసికొని మీ నాన్నగారిని వదిలెయ్యమంటావు! అంతేనా?"

"కాదు. మీరలా చేసినా, ఈ గడప వదిలి మరో గడప చూసుకొంటారు. నేను కోరేది వేరు. ఈ సాయంత్రం మా నాన్నగారు మీ మెట్లెక్కేవరకూ నన్నిక్కడే వుండనివ్వండి. ఆయన కళ్లలో మనమిద్దరమూ పడాలి! ఆయన వచ్చే సమయానికి ఆ ఉయ్యాల బల్ల మీద మీ దగ్గరగా కూర్చోనిస్తే చాలు! అంతకంటే మరింకేమీ చెయ్యనక్కర్లేదు! ఆయన మనసు విరిగి, సానివాడలో మరింక అడుగు పెట్టరు!"

సుబ్బారావు మాటలు విని ధనలక్ష్మి దిగ్భ్రాంతి చెందింది. 'రాజారావు ప్లీడరు' రసానుభూతి కోసం తన దగ్గరకు వస్తున్నాడని చెబితే సుబ్బారావు కర్థం కాదు. మనిషి చూస్తే కదిలేటట్టు లేడు.

సాలోచనగా తల పంకిస్తూ అంది.

"నాలుగు నెలల క్రితం మొదలైన ఈ ఏర్పాటులో నాకు శాంతి లభిస్తోంది. ఈ ఏర్పాటు జీవితాంతం కొనసాగుతుందని ఆశపడ్డాను.అయిదు వేలాశ చూపించి, అయిదు కాలాల పాటుండే రక్షణని అర క్షణంలో పోగొట్టుకోమంటావు? ఏమంత న్యాయం?"- ధనలక్ష్మి గుండెల్లోంచి పుట్టుకొచ్చిన మాటలవి.

సుబ్బారావు బిత్తరపోయాడు.

"నేను ముందరే మీకు చెప్పాను. మా అమ్మ పెదవి విప్పకపోయినా, ఆమె మానసిక క్షోభని నేను భరించలేను. ఈ సహాయం మీరు చెయ్యక తప్పదు" - సుబ్బారావు ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

"ఎదురుగా అలా రోడ్డు బయటకు చూడు. ఎదురింటి అరుగు మీద ఏం కనిపిస్తోందో చెప్పు!"

ధనలక్ష్మి ఎందుకలా అందో అర్థం కాక, సుబ్బారావు తెరిచి వున్న ద్వారంలోంచి చూశాడు. ఎదురింటి అరుగు మీద ముగ్గురు యువతుల్ని చుట్టూ కూర్చోపెట్టుకొని, ముక్కాలి పీట మీద కూర్చుని మాలలు కడ్తున్న ఓ ఏభై ఏళ్లు దాటిన స్త్రీని చూశాడు.

"ఎవరో కొత్త వ్యక్తి ఇక్కడున్నాడని దానికి తెలుసు. నేనిప్పుడు లేచి వెళ్లి తలుపు వేసినా, సాయంత్రం మీ నాన్నగారొచ్చినప్పుడు నువ్వడిగినట్లు చేసినా, ఆ కోకిలమ్మ వాడంతా చాటి పంచాయితీ పెడ్తుంది! నువ్వు చేసిన ఈ ఆలోచనా, వేసిన పథకమూ ఫలించవచ్చును. కాని, అతి భయంకరమైన నమ్మకద్రోహం చేశానన్న ముద్ర నా మీద పడ్తుంది. అటు మీ నాన్నగారి దృష్టిలో దిగజారి, ఇటు నా జాతి వర్గంలో అపహాస్యం పాలై, రెండు విధాలా చెడినదాన్నవుతాను. నువ్వింటికిపోయి మీ నాన్నగారిని బెదిరించో, లేదా ఆయనకి నచ్చచెప్పో ఏదో విధంగా కార్యం సాధిస్తే అందరికీ మంచిది. నువ్వు లక్షలిచ్చినా

సరే, ఈ పనికి నేనొప్పుకోను. అందుకని దయచేసి ఎదురింటి కోకిలమ్మ చూస్తుండగా నువ్వు వెళ్ళిపోతే బావుంటుంది!"- ధనలక్ష్మి అనునయంగా అంది.

సుబ్బారావు కూర్చున్న కుర్చీలోంచి లేవలేదు. నిస్సహాయంగా, దీనంగా చూస్తున్న అతనిపై ధనలక్ష్మికి ఒకింత జాలి కలిగింది. తల్లి మనసుని సంతోషపర్చడం కోసం అతను చేసిన ప్రయత్నం అభినందించదగ్గదే. అతని మాటల్లోని నిజాయితీ, పట్టుదలా ధనలక్ష్మిని మరీ మరీ ఆలోచించేటట్లు చేశాయి. తన వృత్తికి భంగం రాకుండా, పేరుకు మాట రాకుండా సహాయం చెయ్యడం కష్టమే.

"పోనీ మరో మార్గం చెబ్తాను. తండ్రీ కొడుకులిద్దరూ ఒకే కొంపకి వెళ్ళినా జనాలు అపహాస్యం చెయ్యక మానరు! నా పెంపుడు కూతురు పరువానికొచ్చింది. కన్నెరికం చేస్తామని చాలామంది రాయబారాలు పంపారు. ఆ పుణ్యం నువ్వే కట్టుకో! నా పరువూ దక్కుతుంది, నీ కోరికా నెరవేరుతుంది! ఏమంటావు?" అంది ధనలక్ష్మి.

సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు. ధనలక్ష్మి నిజాయితీని, ఆత్మ గౌరవాన్ని ఆమె మాటల్లో గుర్తించాడు. ధనలక్ష్మి మరో మార్గం సూచిస్తోంది. కాని, కాని.....

"మా నాన్నగారు పెళ్ళయి, పిల్లలు పెద్దయిన తర్వాత చేసిన తప్పు, నన్ను పెళ్ళవ కుండానే చెయ్యమంటున్నారు! ఏమంత భావ్యం?" - సుబ్బారావు ఆలోచనలు మాటల రూపం దాల్చాయి.

"నీ దృష్టిలో తప్పు కావచ్చు. కాని ఈ సాని వృత్తి మా మనుగడ. అయినా చిత్రమేమి టంటే - నువ్వనుకొంటున్న తప్పు పని మట్టుకు చెయ్యడానికి సిద్ధంగా లేవుకాని, తప్పుడు ముద్ర మీద వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నావు! సరేలే, కన్నెరికమూ వద్దూ, పాడూ వద్దు! నా పెంపుడు కూతురు బంగారమ్మని తీసికొస్తాను. దానితో కబుర్లు చెబ్తూ కూర్చో. మీ నాన్నగారి ఎదురుగా బంగారమ్మతో ఉయ్యాల లూగుతావో, ఒళ్లో తల పెట్టుకొని పడుకొంటావో నీ యిష్టం. నేను పోయి ఎదురింటి కోకిలమ్మతో మీ నాన్నగారొచ్చేవరకూ కబుర్లాడుతూ కూర్చుంటాను. ఇంతకంటే నేను చేయగలిగింది లేదు"

ధనలక్ష్మి లోపలికి వెళ్ళి బంగారమ్మని తీసికొచ్చి ఉయ్యాల బల్ల మీద కూర్చోబెట్టింది. 'చక్కగా పెళ్ళిళ్ళు చేసికొని కాపురాలు చేసుకోవలసిన వాళ్ళు-వీళ్ళకిదేం గతి?!' సుబ్బారావు బంగారమ్మ సుందర రూపాన్ని చూసి జాలిపడుతూ అనుకొన్నాడు.

"తెరిచి వున్న తలుపుల్ని అలాగే ఉండనియ్యి. కన్నెరికం పండుగ చెయ్యందే వృత్తిలోకి దింపిందని అపవాదొస్తుంది. కన్నెరికం చేద్దామని ఉబలాటపడ్తున్న కుర్రాడు అమ్మాయితో మాట్లాడుతున్నాడని కోకిలమ్మకి చెబ్తాను. ఆ అయిదు వేలు తీసి సంచిలో పెట్టుకో. నీ కోసం, నీ తల్లి కోసం నాకు దొరికిన శాంతిని దూరం చేసికొంటున్నాను. డబ్బిచ్చి ఏ వస్తువునైనా కొనే ఈ సమాజంలో డబ్బు తీసికొని అశాంతిని కొనుక్కోవడం నా కిష్టం లేదు. ఆ వచ్చే అశాంతిని అలాగే రానివ్వు!"

ధనలక్ష్మి బయటకు వెళ్ళి, కోకిలమ్మ అరుగు మీదకు చేరుకొంది.

సంధ్యవేళ స్కూటరాపి స్టాండు వేశాడు రాజారావు. ఎదురింటి అరుగు మీద కూర్చుని కబుర్లాడుతున్న ధనలక్ష్మిని చూశాడు. ధనలక్ష్మి నవ్వుతూ అరుగు దిగి, రోడ్డు దాటి రాజారావు దగ్గరకు చేరింది. ఇద్దరూ గేటులోంచి వెళ్లి మెట్లెక్కి ముందు గదిలో అడుగుపెట్టారు. ధనలక్ష్మి వెంటనే తలుపు మూసింది. ఎదురుగా సుబ్బారావునీ, బంగారమ్మనీ చూసి స్తంభించిపోయాడు రాజారావు. ఉధృతమైన కోపం ముంచుకొచ్చి, నిలువెల్లా కంపించసాగాడు. నిప్పులు కురిసే కళ్ళతో ఏమిటిదన్నట్లుగా చూశాడు.

ధనలక్ష్మి రాజారావు కళ్లలోకి సూటిగా చూస్తూ అంది- "బంగారిని నిన్న సాయంత్రం మరిడమ్మ తీర్థంలో చూశాడట! వివరాలు తెలుసుకొని వచ్చిపడ్డాడు. కన్నెరికం చేస్తానంటు న్నాడు. మాటల్లో మీ అబ్బాయని తెలిసింది. ఇందులో వున్న ఇబ్బందులు నాకు తెలుసు. అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలు! అందుకనే మీ అనుమతి లేందే ఒప్పుకో నన్నాను. మీ తండ్రీ కొడుకులిద్దరూ ఈ వ్యవహారం తేల్చుకోండి మరి!"

సుబ్బారావు మరోసారి ధనలక్ష్మికి మనసులో జోహార్లర్పించాడు.

"సుబ్బూ! నువ్వీ పని నేను మీ అమ్మకేదో ద్రోహం చేశానన్న కసి కొద్దీ చేశావని పిస్తోంది కానీ, యాదృచ్ఛికంగా జరిగినట్లు కనబడటం లేదు. ధనలక్ష్మీ! బంగార్ని త్వరగా వృత్తిలోకి దింపి ఎక్కువ డబ్బు సంపాదించాలన్న యావ నీకు పట్టినట్లుగా ఉంది. అయితే పర్యవసానం ఈ విధంగా ఉంటుందని కలలో కూడా ఊహించలేదు. ఏది ఏమైనా మీరందరూ కలిసి వెన్నుపోటు పొడిచారు! వస్తాను"- రాజారావు బాధగా అని తలుపు దగ్గరకు వెళ్ళి, వెనక్కు తిరిగి మళ్ళీ అన్నాడు.

"మరోమాట! ఈ క్షణం నుంచీ నువ్వు స్వేచ్ఛగా వుండొచ్చు. బంగారికి కన్నెరికం చెయ్యడానికి సుబ్బుకి అనుభవం కావాలంటే, నువ్వే పాఠాలు నేర్పుకోవచ్చు!"

విసురుగా తలుపు తీసికొని బయటకు వెళ్ళిపోయాడు రాజారావు, మరే విధమైన సంభాషణలకీ అవకాశమివ్వకుండా. రాజారావు చివరగా అన్న మాటలు ధనలక్ష్మి మనసుని తీవ్రంగా గాయపరిచాయి. కళ్ళమ్మట నీళ్ళతో సుబ్బారావుకేసి చూడడం తప్ప మరేమీ చెయ్యలేక పోయింది.

సుబ్బారావు ఉయ్యాల బల్ల దిగి, "నేను మీకు తీరని దుఃఖం కలిగించాను. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియట్లేదు!" అంటూ ధనలక్ష్మి పాదాల్ని వంగి స్పృశించాడు.

ధనలక్ష్మి ఒక్కసారిగా చలించిపోయింది.

"జన్మనిచ్చిన తల్లి కోసం నువ్వీ కళంకం తెచ్చుకొన్నావు! తనువులమ్ముకొని బ్రతికే మాకు మనసులనేవి ఏనాడో హరించుకు పోయాయి. అవి అందలాలెక్కినా, అగాధాల్లోకి త్రోయబడ్డా ఒకటే మాకు! నువ్వు నిశ్చింతగా వెళ్లు!" అంది సుబ్బారావుని దీవిస్తూ.

★ ★ ★

అన్యమనస్కంగా ఇంటికి వచ్చిన రాజారావుని చూసి, "కోర్టులో గొడవలేమైనా జరిగాయా? అలా వున్నారు?" అని ప్రశ్నించింది పార్వతి.

"ఎలా వుంటే నీకెందుకు? నీ ప్రవర్తన మూలాన నేను చాలాకాలం ఆలోచించి, ఆగి, ఎన్నుకొన్న మార్గంలో నీ మూడో కొడుకు ముళ్ల కంచెలు వేశాడు! నేను చేరిన కొంపకే వాడూ చేరాడు! నీ కళ్ళిప్పుడు శాంతిస్తాయనుకొంటాను! వాడు చేసిన నేరానికి శిక్ష ననుభవించవల్సిందే. విల్లు మారుస్తున్నాను. వాడికి చిల్లిగవ్వ కూడా దక్కదు!"

రాజారావు కోపంగా సమాధానమిచ్చి, బీరువా లాకర్‌లో ఉన్న విల్లు తీసికొని ఆఫీసు గదిలోకి వెళ్ళాడు. పార్వతి మ్రాన్పడిపోయింది. నిస్సత్తువగా డైనింగ్ టేబుల్ పక్కనున్న కుర్చీ మీద కూలబడింది. ఇంతకాలమూ తనని తాను మోసగించుకుంటూ వస్తున్న జీవితం మనసులో మెదలసాగింది.

పార్వతి వలచిన కృష్ణప్రసాద్‌తో వర్ణాంతర వివాహానికి ఒప్పుకోలేదు, పార్వతి తల్లిదండ్రులు. బ్రహ్మచారిణిగా ఉండిపోదామనుకొంది కాని, ఇద్దరు చెల్లెళ్ల వివాహాలకి తన నిర్ణయం ఒక రకమైన ప్రతిబంధకం కావొచ్చునేమోనన్న భయం వల్లా, తల్లిదండ్రుల వత్తిడి వల్లా, గోదావరి జిల్లా నుంచి వచ్చిన రాజారావు సంబంధాన్ని ఒప్పుకొంది.

మొదటి రాత్రి నుంచే రాజారావు జీవితంలో ఓ పీడకల ప్రారంభమైంది. ఎన్నో సరదాలతో దాంపత్య జీవితం గడపాలని ఊహించుకొన్న రాజారావుకి నిరాశే ఎదురైంది. రాజారావు మల్లెమాలలు కొని తెస్తే మేకుకు తగిలించేది పార్వతి. ముచ్చటగా తెల్ల చీర కొనిస్తే కట్టుకొని, వంట చేసి నూనె మరకలతో పాడు చేసేది. గడప దాటి పట్టుమని పదడుగులు బయటకు వెళ్లివస్తే పట్టుచీరలూ, సిల్కు చీరలూ కట్టే పార్వతి, పడగ్గదిలో వంటి శుభ్రత లేకుండా, బట్ట శుభ్రత లేకుండా అడుగుపెట్టేది. ముద్దు పెట్టబోతే మొహం తిప్పుకొని, కౌగిలించబోతే విదిలించుకొని విరసం చూపించేది. ఎప్పటికప్పుడు ఏవో కుంటి సాకులు చెప్పి తప్పించుకొని, రాజారావు కోరికల్ని మరీ చంపుకోలేని పరిస్థితికొచ్చి ఇంకా తనకి తప్పదనుకొన్నప్పుడు, స్పందన లేని మొండి దేహాన్నర్పించి, ఎవరో బలాత్కారం చేస్తోన్నట్లుగా బాధపడేది. సెక్సు పట్ల పార్వతికున్న విముఖతని ఓ పాటిగా అర్థం చేసికొన్న రాజారావు, పార్వతిని మానసిక వైద్యుల దగ్గరకూ, ఇతర నిపుణుల వద్దకూ తీసుకు వెళ్లడానికి ప్రయత్నించాడు కాని, పార్వతి ససేమిరా ఒప్పుకోలేదు.

అయితే ఈ ఒడుదుడుకుల దాంపత్య జీవితం జరిగిన తొమ్మిదేళ్ళలోనూ నలుగురు బిడ్డలు పుట్టుకొచ్చారు. మొదటగా ముగ్గురు కొడుకులూ, ఆఖరుగా ఆడపిల్ల. మనవరాల్ని చూడాలని వుందని తల్లిదండ్రులు ఉత్తరం వ్రాస్తే, ఆర్నెల్ల లక్ష్మిని గుంటూరు పుట్టింటికి తీసుకొనివెళ్ళి, ఓ వారం రోజులుండి తిరిగి వచ్చింది. ఆ వెళ్ళినప్పుడు అమెరికా నుంచి తిరిగి వచ్చిన కృష్ణప్రసాద్, ఇంకా అవివాహితుడిగానే వుండిపోయిన కృష్ణప్రసాద్, మానని గాయాన్ని మరింతగా రేపడంతో, పార్వతి తన్ను తాను క్షమించరాని ఓ నేరస్థురాలిగా భావించుకొంది. ఇంటికి తిరిగి వచ్చిన రాత్రి, రాజారావు దగ్గరకు చేరబోతే, పార్వతి ప్రవర్తించిన తీరు పతాకస్థాయినందుకోవడంతో, రాజారావు మొదటిసారిగా సహనం కోల్పోయి, కోపోద్రిక్తుడయ్యాడు.

"ఇంతకాలమూ జన్మతః నీకు సెక్సు పట్ల విరక్తి, విముఖతా అని సర్దుకుపోతూ

వచ్చాను. కాని ఈ రోజు నీ ప్రవర్తన చూసిన తర్వాత, నువ్వు మనస్సు మరొహారికిచ్చి, మనువు నాతో ఆడినట్లుగా అనుకోక తప్పటం లేదు. ఒకవేళ నా ఊహే కనక నిజమైతే, నువ్వు చేసిన నేరానికి నీకు నువ్వు శిక్ష విధించుకొంటున్నట్లు నువ్వనుకొంటున్నా నేను చెయ్యని నేరానికి నాకు శిక్ష విధించినట్లు నువ్వు గుర్తించలేదు. తాళి కట్టిన అధికారంతో నేను అడపా దడపా పడ్డ కక్కుర్తికి నాలుగు జీవాలకి రూపం పోశావు. వాళ్ళూ నీకేమి కాదనుకొంటే, నువ్వీ యిల్లు విడిచి నిరభ్యంతరంగా వెళ్ళవచ్చు. కాదంటావూ, ఈ జీవితాల్ని ఇలాగే కొనసాగనీ. నువ్వూ నేనూ బ్రతికున్నన్నాళ్ళూ, నాలుగ్గోడల మధ్యా నీ మీద చెయ్యి వేస్తే లక్ష్మి మీదొట్టు! ఎందుచేతనంటే, అనురాగ రహితమైన దాంపత్య జీవితం గడపడం నాకూ అసహ్యంగానే ఉంది!''

పార్వతి దగ్గర సమాధానం లేదు. మౌనంగా ఉండడం తప్ప మరేమీ చెయ్యలేక పోయింది. ఆ రోజు నుంచీ రాజారావుకి కోర్టూ, పొలమూ తప్ప మరే ధ్యాస లేదు. దాంపత్యసుఖాన్ని దూరం చేసికొన్నా, పార్వతిని కాని, పిల్లల్ని కాని అశ్రద్ధ చెయ్యలేదు. ఇంటి ఖర్చులకని, పండుగలకని, పబ్బాలకని పార్వతి చేతికి పుష్కలంగా డబ్బిచ్చేవాడు. అందరి పిల్లలకి మంచి చదువులు చెప్పించాడు. పెద్దవాళ్ళిద్దరికీ, ఆఖరుపిల్ల లక్ష్మికి ఘనంగా పెళ్ళిళ్ళు చేశారు.

లక్ష్మి పెళ్ళి జరిగిన ఏణ్ణర్థం తర్వాత, ఓ క్రిమినల్ కేసులో అనవసరంగా ఇరుక్కు పోయిన ధనలక్ష్మి వైపు కోర్టులో వాదించి, ఆమెని ఇబ్బందుల నుంచి తప్పించాడు రాజారావు. ఆ కేసు జరుగుతున్న సమయంలో రాజారావూ, ధనలక్ష్మీ ఒకరికొకరు చేరువయ్యారు. రాజారావు ధనలక్ష్మిని శాశ్వతంగా వుంచుకొన్నాడన్న వార్త ఊరందరితో బాటు పార్వతికీ తెలిసినప్పుడు, నిజానికి పార్వతి ఓ విధమైన సంతృప్తితో దీర్ఘ నిశ్వాసం విడిచింది.

గత స్మృతులతో సతమతమవుతున్న పార్వతి అడుగుల చప్పుడు విని తల ఎత్తి చూసింది. సుబ్బారావు పక్కగా నిల్చుని, గోడకేసి చూస్తూ అన్నాడు.

“అమ్మా, నువ్వింక నిశ్చింతగా ఉండు! నాన్నగారింక అటువైపు వెళ్ళకుండా చేశాను!''

“నువ్వు చేసిన ఘనకార్యం గురించి ఆయనే చెప్పారు. నీకు తెలీదేమో, నీకు ఆస్తిలో వాటా లేకుండా విల్లు మారుస్తున్నారు. నువ్వు చేసినదంతా నా మనస్సుని సంతోష పెట్టడానికే అయితే, నువ్వనవసరంగా నష్టపోయావు! నువ్వు చేసింది వ్యర్థ త్యాగం?'' అంది భారంగా నిట్టూరుస్తూ.

సుబ్బారావుకి తల్లి మాటలు అర్థం కాలేదు. బల్ల మీద తల్లి వడ్డించిన భోజనాన్ని అన్యమనస్కంగా తిని, గదిలోకి వెళ్ళి పడుకొన్నాడు సుబ్బారావు. ఏవో చెప్పరాని ఆలోచనలతో సతమతమవుతూ, అతి కష్టం మీద కలత నిద్రలోకి జారుకొన్న సుబ్బారావుకి అర్ధరాత్రి వేళ మెలకువ వచ్చింది. డైనింగ్ టేబుల్ దగ్గర్నుంచి తల్లిదండ్రుల మాటలు వినవచ్చాయి.

"......కారణం ఏదైనా కానీండి, మిమ్మల్ని శాసించే అధికారం, అర్థించే అర్హతా లేకుండా చేసికొన్నాను. తల్లి మనసు కష్టపడ్తోందనుకొని సుబ్బు అనాలోచితంగా చేసిన పని, మీ దృష్టిలో నేరమే కావచ్చును. కాని నా కోసం చేసిన పనికి వాడిని పూర్తిగా వీలునామాలోంచి తొలగించడం మీకు భావ్యం కాదు! మీరు ఆస్తి నివ్వకపోయినా వాడు బాధపడడుకాని, తల్లిగా నా హృదయం క్షోభిస్తుంది. మీరు నిశ్చింతగా ధనలక్ష్మి ఇంటికి వెళ్తూ ఉండండి. సుబ్బుని అటువైపు వెళ్లకుండా నేను ప్రయత్నం చేసి వాణ్ణి బెంగుళూరు పంపేస్తాను!" - పార్వతి వేడుకోలుగా అంటోంది.

"మొదట్లో,సమాధానం నువ్వే ఇచ్చుకొన్నావు! నీకు కలిగే మనఃక్షోభతో నువ్వు బాధపడు. నాకు కలిగిన మనస్తాపంతో నేనేడుస్తూ కూర్చుంటాను. ఈ విషయంలో నన్నింక విసిగించకు. సుబ్బు ముఖం చూడ్డాని క్కూడా నాకసహ్యమేస్తోంది. వాణ్ణి వెళ్లి పొమ్మని చెప్పు...."- రాజారావు కోపంగా అన్న మాటలకి పార్వతి మౌనంగా వుండిపోయింది.

సుబ్బారావు మనసులో రోషం, పౌరుషం ఒక్కసారిగా చోటు చేసికొన్నాయి.

తెల్లవారుఝామున తలుపు తట్టిన చప్పుడు విని, లేచి వెళ్లి తలుపు తీసిన ధనలక్ష్మి ఎదురుగా సూట్‌కేస్ పట్టుకొని, మెట్ల మీద నిల్చున్న సుబ్బారావుని చూసి ఆశ్చర్యపోయింది. గుమ్మం దగ్గరే నిల్చుని సూట్ కేస్ పక్కన పెట్టి ధనలక్ష్మితో అన్నాడు.

"ఏదో నాన్నగారిని ఇటువైపు రాకుండా విముఖుణ్ణి చేసి తల్లిని సంతోషపెట్టే ప్రయత్నంలో నిన్న మధ్యాహ్నం మీ ఇంట్లో అడుగు పెట్టాను. మీ సహాయం వల్ల నా ధ్యేయం నెరవేరింది. నాకు చేయూత నిచ్చి మీరు మాట పడ్డారు, నష్టపోయారు! మాటల సందర్భంలో వృత్తిలోకి దిగడం తనకిష్టం లేదని బంగారమ్మ చెప్పింది. నేను బంగారమ్మను పెళ్లి చేసికోవాలను కుంటున్నాను!"

అతని మాటల్లోని దృఢ నిశ్చయాన్ని గుర్తించగలిగిన ధనలక్ష్మికి నోట మాట రాలేదు.

సుబ్బారావే మళ్ళీ అన్నాడు- "నిజానికి మీ సంస్కారమూ, బంగారమ్మ మనసూ నా ఈ నిర్ణయానికి నాంది పలికితే, రాత్రి మా ఇంట్లో తలెత్తిన సమస్యలు మరింత దోహదం చేశాయి. మీరు వెళ్లి బంగారమ్మని లేపి అడగండి. తనకీ, మీకూ అంగీకారమైనపక్షంలో గడప దాటి లోపలికి వస్తాను. కాని పక్షంలో మెట్లు దిగి బెంగుళూరు వెళ్లిపోతాను"

ధనలక్ష్మి లోపలికి వెళ్ళి, అయిదు నిమిషాల్లో బంగారమ్మతో తిరిగి వచ్చింది. బంగారమ్మ బయటికొచ్చి సూట్‌కేసు తీసుకొని లోపలకు వెళ్ళింది. సుబ్బారావు వెనకగా లోపల అడుగు పెట్టాడు. రెండు రోజుల వ్యవధిలో సుబ్బారావుకీ, బంగారమ్మకీ ఘనంగా పెళ్ళి చేసింది ధనలక్ష్మి.

కన్నెరికం జరగవలసిన కొంపలో కన్యాదానం జరిగినందుకు సానివాడ సంతోషించింది. ఊరంతా విస్తుపోయింది!

('ఆంధ్రభూమి' మాసపత్రిక : సెప్టెంబర్ 1997)